సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 8 । జూన్ । 2025



శుభకార్యానికి వెళ్లి వస్తుండగా

శుభ కార్యానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం ఎదురైంది. ఓ మహిళ దుర్మరణం పాలయ్యారు.

-10లో



మూల్యం చెల్లించక తప్పదా

జిల్లాకు కోవిడ్ కిట్లు రావడం లేదు. సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

-10లో

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీలో నిరాశ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు నిరాశ పరిచారు. తాజాగా వెలువడిన ఫలితాలలో సెకండ్ ఇయర్ జనరల్ విద్యార్థులు 65శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రస్థాయిలో 10వ స్థానంతో సరిపెట్టుకున్నారు. 5525 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 3607 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఫస్ట్ ఇయర్ జనరల్ విద్యార్థులు 47శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో 9వ స్థానంలో నిలిచారు. 6,151 మంది విద్యార్థులు హాజరు కాగా, కేవలం 2,890 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో మొదటి ఏడాది విద్యార్థులు 207మంది హాజరుకాగా 127మంది, రెండో ఏడాది 244 మంది హాజరు కాగా 187మంది పాసయ్యారు.

10 నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ సెమిస్టర్ ఎండ్ విధానంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ కింద ఈ నెల 10 నుంచి ఆరో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతాయని వర్సిటీ యూజీ ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.పద్మారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో సెమిస్టర్ పరీక్షలు ప్రస్తుతం జరుగుతున్నాయన్నారు. 2, 4 సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 24 వ తేదీ నుంచి వచ్చే నెల 8 వ తేదీ వరకూ జరుగుతాయని తెలిపారు. ఇటీవల విడుదల చేసిన డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి రీవాల్యుయేషన్ ఫలితాలను అధికారులు విడుదల చేశారు. దీనికి సంబంధించి 41 మంది రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేయగా 16 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలను యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో, జ్ఞానభూమి పోర్టల్ ఉంచామని అధికారులు తెలిపారు.

బెల్టుషాపులపై దాడులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని తండేవలస పంచాయతీ బెండువానిపేట గ్రామాల్లో బెల్టుషాపులపై రూరల్ పోలీసులు శనివారం దాడులు చేశారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు గ్రామంలోని ఇళ్ల వద్ద అక్రమంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారి ఇళ్లపై ఏకకాలంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో పంపాన లక్ష్మీ వద్ద 40 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకోగా, ఆర్.చిట్టిమ్మ వద్ద మరో 22 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై వేర్వేరుగా కేసులు నమోదు చేశామని రూరల్ ఎస్‌ఐ రాము తెలిపారు.

పరిమళించిన మానవత్వం



అన్నం తినిపిస్తున్న గోపాల మిత్ర బాలకృష్ణ, పక్కనే సర్పంచ్ కృష్ణారావు

కాశీబుగ్గ: పలాస మండలం టెక్కలిపట్నం గ్రామంలో ఓ వృద్ధుడు వడదెబ్బకు గురై సొమ్మసిల్లి పడిపోయాడు. మండుటెండలో రోడ్డుపై వృద్ధుడు అలా పడి ఉండడాన్ని గమనించిన టెక్కలిపట్నం సర్పంచ్ పాలిన కృష్ణారావు, గోపాలమిత్ర అవుగాన బాలకృష్ణతో కలిసి బస్టాండ్‌కు తీసుకువచ్చారు. అనంతరం ఆ వృద్ధునికి సపర్యలు చేసి భోజనం తినిపించి నీరు తాగించారు.







భక్తిశ్రద్ధలతో బక్రీద్

జిల్లా కేంద్రంలోని జామియా మసీదులో ముస్లింలు శనివారం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ సందర్భంగా మత పెద్ద ఇమాం వహాబ్ ఆధ్వర్యంలో నమాజు కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ కూడా పాల్గొని నమాజ్ చేశారు.
-శ్రీకాకుళం కల్చరల్





'ఏ ఊరు చూసినా ఏమున్నది గర్వకారణం.. వ్యవస్థ సమస్తం రక్తాశ్రువుల సమ్మేళనం'లా జిల్లా పరిస్థితి తయారైంది. హత్యలు, దాడులు, బెదిరింపులు, దొంగతనాలు, దోపిడీలతో ప్రశాంత సిక్కోలులో అశాంతి నెలకొంది. రాజకీయ రా'బందువుల' అండదండలతో కొందరు రెచ్చిపోతుండగా.. వ్యవస్థలోని లొసుగులను వాడుకుని మరికొందరు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. కళ్ల ముందే దర్జాగా పెద్దలు ఇసుక, మట్టిని దొంగిలిస్తుండగా.. వారికి పోటీగా చోరులు కూడా దొంగతనాలు, దోపిడీలతో హస్తలాఘవం చూపిస్తున్నారు. మరోవైపు రెడ్‌బుక్ నామజపం చేస్తూ విపక్ష నాయకులపై వికృత చేష్టలకు పాల్పడుతున్నారు.

ఏడాది పాలన తీరు
రక్తం.. కన్నీరు

- కూటమి పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు
- పెరుగుతున్న దాడులు, వేధింపులు
- శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం

శ్రీకాకుళం క్రైమ్:

పోలీసులు డ్రోన్లు ఎగరేస్తున్నారు... వాటి కంటికి తవ్వుకెళ్లిపోతున్న ఇసుక కనిపించదు. ఈగిల్, శక్తి బృందాలు నిఘా పెట్టాయి.. కానీ జిల్లా కేంద్రంలో గంజాయి బాబులు రెచ్చిపోతూనే ఉన్నారు. పోలీసులు హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు.. అయినా దారి దోపిడీలు ఆగడం లేదు. అధికార పక్ష నేతలు మైకు దొరికితే చాలు సుద్దులు చెబుతున్నారు.. విపక్ష నాయకులపై కక్ష సాధింపులు ఆగడం లేదు. ప్రశాంతమైన సిక్కోలు ఏడాది కూటమి పాలనలో లెక్కకు మిక్కిలిసార్లు రోదించింది. రక్తం, కన్నీరు కలిసి ప్రవహించగా శాంతిభద్రతలు ప్రశ్నార్థకమయ్యాయి. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలనే కాక ఓట్లేసిన ప్రజలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టులు, సోషల్ మీడియా యాక్టివిస్టులు, దళితులు ఇలా ఎవరు ప్రశ్నించినా కేసులు వచ్చి వాలిపోతున్నాయి. ఒక్క పలాసలోనే ఇలా 36 కేసులు నమోదు కావడం విశేషం. ఇందులో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై నాలుగు కేసులు కట్టడం గమనార్హం. శ్రీకాకుళంలో 14, టెక్కలిలో పది కేసులు నమోదయ్యాయి.



ఏడాది పాలన
ఇదేనా బాబూ..

ప్రభుత్వ కార్యాలయాల్లో భద్రత ఉందా..?

- జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళల భద్రత ప్రశ్నార్థకమవుతోంది.
- ఆమదాలవలసకు చెందిన ఓ మహిళా కానిస్టేబుల్ తనపై ఎస్‌ఐ లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ ఎస్పీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.
- డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఓ కాంట్రాక్టు ఉద్యోగి ఓ వివాహితను ఉద్యోగమిప్పిస్తానని నమ్మించి డబ్బులు తీసుకోవడమే కాక శారీరకంగా లోబర్చుకున్నాడు. వివాహిత ఆత్మహత్యకు పాల్పడటం జిల్లాలో సంచలనం రేకెత్తించింది.
- నిన్నటికి నిన్న ఓ ప్రభుత్వ కార్యాలయంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ బాత్రూమ్‌లో తోటి సహోద్యోగి అశ్లీల చిత్రాలు తీశాడు.



నరసన్నపేటలో వృద్ధురాలు గున్నమ్మ హత్యకు గురైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి (ఫైల్)

హత్యల్లో కొన్ని..

- మంత్రి అచ్చెన్న సొంత పంచాయతీ నిమ్మాడలోని వెంకటాపురం గ్రామంలో తోట మల్లేషు అనే వ్యక్తి టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడి చనిపోయారు.
- గత ఏడాది ఆగస్టు 18 అర్ధరాత్రి ఎచ్చెర్ల ఫరీదుపేటకు చెందిన వైఎస్సార్ సీపీ సాధారణ కార్యకర్త కూన ప్రసాద్‌ను దారి కాచి టీడీపీ కార్యకర్తలు కొట్టారు. ఆయన ఆగస్టు 24న మరణించాడు.
- డిసెంబరు 6న గార మండలం శ్రీకూర్మం ఆర్టీసీ కూడలిలో ఉప్పాడ రాజేష్ అనే యువకుడిని పాత కక్షల నేపథ్యంలో హతమార్చారు.
- మార్చి 3న నరసన్నపేట బొంతలవీధికి చెందిన కేవిటి గున్నమ్మ (85) అనే వృద్ధురాలు దారుణహత్యకు గురైంది. బంగారం దోచుకుని ఆమె మృతదేహాన్ని రోడ్డుపై పడేశారు.



గున్నమ్మ (ఫైల్)

- మార్చి 28న కవిటి మండలం ఆర్.కరాపాడు గ్రామ శివారు రైల్వేగేటు వద్ద 5 నెలల గర్భిణి కొంతాల మీనాక్షిని భర్తే సుపారీ ఇచ్చి హత్య చేయించాడు.

అంతులేని దాడులు

- అక్టోబరు 16న జిల్లా నడిబొడ్డున బలగమెట్టు వద్ద వందలమంది జనాలు చూస్తుండగా సనపల సురేష్ అనే వ్యక్తిని దారుణంగా దాడి చేశారు.
- అక్టోబరు 27న కోటబొమ్మాళి మండలం కిష్టుపురంలో దళిత దంపతులైన చల్ల అప్పలరాజు, దమయంతిలపై టీడీపీ వాళ్లు ఇంటికి వచ్చి మరీ దాడికి పాల్పడ్డారు.
- అదే రోజు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ సాక్షిగా మాజీమంత్రి సీదిరి అనుచరులు అల్లు రమణ, మన్మధలపై టీడీపీ నాయకులు దాడిగి తెగబడ్డారు.
- అక్టోబరు 26న ఉత్సవాల్లో డ్యాన్స్ చేయను అన్నందుకు తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ బాలికపై పలాస మండలం తెలుగు యువత అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు దాడికి పాల్పడ్డాడు.
- నవంబరు 16న వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు మహిళలపై దాడి చేశారు.
- జనవరిలో పాతపట్నం దువ్వారివీధికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పెద్దింటి తిరుపతిరావుపై వేకువజామున గుర్తుతెలియని వ్యక్తులు మెడపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు.

- చిన్నపిల్లలపై 2023–2024 టెన్యూర్‌లో 38 లైంగిక నేరాలు జరగ్గా ఇప్పుడా సంఖ్య 42కు పైగా చేరింది. పోక్సో గతంలో 67, ఇప్పుడు 73 నమోదయ్యాయి.
- ఎచ్చెర్ల నవభారత్ జంక్షన్‌లో మహిళపై ఆరుగురు మహిళలు అమానవీయంగా దాడి చేశారు.
- కాశీబుగ్గ కేంద్రంగా ఇద్దరు బాలికలకు కూల్‌డ్రింక్‌లో మత్తు కలిపి మద్యం మత్తులో ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడి వీడియోలు తీశారు.

అత్యాచారాలు.. లైంగిక వేధింపులు



- జనవరి 13న రణస్థలం మండలం బంటుపల్లిలో నాలుగో తరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల చిన్నారిని నారు ప్రసాద్ (23) అనే యువకుడు సచివాలయం భవనం మీదకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు.
- జనవరి 30న రాత్రి జిల్లాకేంద్రంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థినిపై దాడి జరిగింది.
- ఫిబ్రవరి 11న తన ఫొటోలు, వీడియోలు న్యూడ్‌గా మార్ఫింగ్ చేసి పోర్న్‌సైట్లలో అప్‌లోడ్ చేశారని, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ యాప్‌ల్లో సైతం హల్‌చల్ చేయించారని జిల్లా కేంద్ర సమీపంలో చదువుకుంటున్న విద్యార్థిని రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- మార్చి 18న తన ప్రాణానికి రక్షణ కల్పించమని సంతబొమ్మాళి మండలం గెద్దలపాడుకు చెందిన ఆశా కార్యకర్త సుత్తు చంద్రమ్మ జిల్లా ఎస్పీని వేడుకుంది.

సిక్కోలులో రౌడీల రాజ్యం

శ్రీకాకుళం టూటౌన్ పరిధిలో నైట్‌బీట్ విధుల్లో ఉన్న కనకరాజు అనే కానిస్టేబుల్ దాడికి గురయ్యారు. డీసీఆర్బీ హెడ్‌కానిస్టేబుల్ త్రినాధరావుపైనా దాడి జరిగింది. దమ్మలవీధిలో ఓ ఎస్‌ఐను తోసేశారు.

అక్రమాల బురద ▸ తీరాల్లో ఇసుక వరద

అక్రమార్కుల ముందు చూపు

- వర్షాలతో నదుల్లోకి నీరు వస్తుందని 'ముందు జాగ్రత్త'
- వంశధార, నాగావళి, బాహుదాలో తవ్వకాల జోరు
- మంత్రులు, ఎమ్మెల్యేల పేరు చెప్పి దందా



కొత్తూరు మండలం గులుమూరు, ఆకుల తంపర మధ్య అక్రమంగా పోగేసిన ఇసుక దిబ్బలివి. ఆ పక్కనే ఉన్న తోటల్లో మరిన్ని పోగులేశారు. ఇక్కడి నుంచి విక్రయాలు సాగిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో ఇదివరకు 18 ఇసుక రీచ్‌లు ఉండేవి. వాటి కాల పరిమితి గత నెలతోనే ముగిసిపోయింది. నిబంధనల ప్రకారమైతే వాటిని నిలిపివేయాలి. ప్రస్తుతం డీసిల్టేషన్ పాయింట్లు తప్ప అధికారిక రీచ్‌లేవీ ఉండకూడదు. కానీ జిల్లాలో అన్ని రీచ్‌లలో తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. వర్షాకాలం సమీపించడంతో తవ్వకాల జోరు మరింత పెంచారు. నదుల్లోకి వరద నీరు వచ్చేస్తే తమ ఇసుక వ్యాపారం పోతుందని విస్తృతంగా తవ్వకాలు జరుపుతున్నారు. తవ్విన ఇసుకను నదీ తీర గ్రామాల్లోని తోటల్లో డంప్ చేస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడికక్కడ ఇసుక పోగులు దర్శనం ఇస్తున్నాయి. అక్కడి నుంచే అమ్మకాలు సాగిస్తున్నారు.

కుమ్మక్కై దోపిడీ

మంత్రులు, ఎమ్మెల్యేల పేరు చెప్పి దోపిడీ చేస్తున్నారు. అంతా కుమ్మక్కై, కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని జేబుల్లో నింపుకుంటున్నారు.

☛ ఆమదాలవలస నియోజకవర్గంలోని తొగరాం పంచాయతీ దిబ్బలపేట, ముద్దాడ పేట, కాఖండ్యాం, నారాయణపురం, పురుషోత్తపురం, చినంకలాం, నిమ్మ తొర్లాడ, దూసి, తోటాడ, అక్కివరం, బెలమం, లొద్దలపేట, కొత్తవలస, సింగూరు, నైరా, అంబళ్లవలస ☛ శ్రీకాకుళం నియోజకవర్గంలోని భైరి, కరజాడ, బూరవల్లి, కళ్లేపల్లి, కిల్లిపాలెం, పొన్నాం, బట్టేరు, గార ☛ నరసన్నపేట నియోజకవర్గంలోని మడపాం, పర్లాం, రామకృష్ణాపురం, శ్రీముఖలింగం, దొంపాక, లుకలాం, బుజ్జిపేట, చేనువలస, చెవ్వాకులపేట, గోపాలపెంట, ఉర్లాం ☛ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బిర్లంగి, బొడ్డవడ, ఈదుపురం, కేశుపురం, కొలిగాం, ఇచ్ఛాపురం టౌన్ పరిధిలో బహుదా నది కొత్త, పాత బ్రిడ్జిల దగ్గర ☛ పాతపట్నం నియోజకవర్గంలోని గులుమూరు, ఆకులతంపర, పాత పొనుటూరు తదితర గ్రామాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి.

వెసులుబాటు సాకుతో..

గత నెల గడువు ముగిసిన ఇసుక రీచ్‌ల్లో తవ్వి, పోగులేసిన ఇసుకను తర్వాతైనా విక్రయించుకుని, తరలించుకోవచ్చని ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు వెసులుబాటు ఇచ్చారు. ఆ రీచ్‌ల పేరు చెప్పి ఎక్కడికక్కడ ప్రస్తుతం కూడా పోగులేసి దోచుకుంటున్నారు. వంశధార, నాగావళి, బాహుదా నదుల్లో దర్జాగా యంత్రాలతో తవ్వకాలు జరిపి, లారీలు, ట్రాక్టర్ల ద్వారా నదీ తీర గ్రామాల్లో తోటల్లోనూ, వంతెనలకు అటు ఇటు డంప్ చేస్తున్నారు. అంతేకాకుండా నడుస్తున్న డీసిల్టేషన్ పాయింట్లలో కూడా అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఆ ఇసుకను కూడా తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. సాధారణంగా నదిలో మేట వేసి ఉంటే దాన్ని మాత్రమే డీసిల్టేషన్ కింద తొలగించాలి. కానీ, ఇక్కడ డీసిల్టేషన్ అర్థాన్నే మార్చేసి డీప్ సిల్టేషన్ అన్నట్టుగా నదుల్లో లోతుగా తవ్వేసి ఇసుకను స్వాహా చేస్తున్నారు. నదుల ప్రవాహానికి అడ్డుగా ఉంటుందని డీసిల్టేషన్‌కు అనుమతిస్తే ఇప్పుడా తవ్వకాలే నదుల గమనాన్ని మార్చేసి, చుట్టు పక్కల ప్రాంతాలను ముంచేసే పరిస్థితులు ఉన్నాయి.



శ్రీకాకుళం మండలంలోని కరజాడలోని ఓ తోటలో అక్రమంగా డంప్ చేసిన ఇసుక ఇది. ఇక్కడి నుంచే అమ్మకాలు జరిపి, లారీల్లో తరలించేందుకు సిద్ధం చేసి ఉంచారు.



నరసన్నపేట మండలం మడపాం బ్రిడ్జికి ఆనుకుని డంప్ చేసిన ఇసుక పోగులివి. నదిలోకి అకస్మాత్తుగా నీరొస్తే తమ వ్యాపారం పోతుందని బ్రిడ్జికి ఆనుకుని ఇసుక పోగులు వేశారు.



ఆమదాలవలస మండలం కొత్తవలసలో అక్రమంగా వేసిన భారీ ఇసుక పోగులివి. ఇక్కడి నుంచే ఇసుకను అడ్డగోలుగా తరలించేస్తున్నారు. లెక్కాపత్రం లేకుండా లావాదేవీలు సాగిస్తున్నారు.



ఆమదాలవలస మండలం కొత్తవలసలో నదిలో చుట్టూ నీరు.. మధ్యలో తవ్వకాలు జరుపుతున్న దృశ్యమిది. పొక్లెయినర్లు పెట్టి, లారీల్లో తరలిస్తున్న దృశ్యమిది.



మెళియాపుట్టి: చింతల పోలూరు గ్రామం వద్ద రహదారికి అడ్డంగా పడిన చెట్టు

గాలివాన బీభత్సం

ఎల్‌ఎన్ పేట: మండలంలో శనివారం సాయంత్రం చీకటి పడే సమయానికి గాలి వాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం మేఘాలు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీచాయి. ఆ ధాటికి పెద్దకోట, పూశాం, ఎల్.ఎన్.పేట గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోయాయి. కొన్ని చోట్ల స్తంభాలపైన, విద్యుత్ వైర్లపైన చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం రాత్రి కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో అన్ని వర్గాల వారు ఇబ్బందులు పడ్డారు. శనివారం రాత్రి కూడా ఆదే పరిస్థితి నెలకొనడంతో తీవ్రంగా ఇక్కట్లకు గురయ్యారు.

మెళియాపుట్టిలో..

మెళియాపుట్టి: మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం ఈదురుగాలులు చెట్లను నేలకూల్చాయి. చింతల పోలూరు వద్ద భారీ సిరిశం చెట్టు నేల కొరిగింది. సిరియాఖండి గ్రామంలో రెండు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. పల్ల అప్పన్న అనే వృద్ధుడి కాలు కరెంటు స్తంభం కింద ఉండిపోయింది. అదే గ్రామంలో మేక మెడపై స్తంభం పడడంతో తల, మొండెం వేరైపోయింది.



మెళియాపుట్టి: చాపర గ్రామంలో రహదారికి అడ్డంగా పడిన చెట్టుకొమ్మలు తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది



ఎల్.ఎన్.పేట: పెద్దకోట వద్ద నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభం

క్లుప్తంగా

టెక్కలి రవీంద్రభారతి పాఠశాలకు తాళాలు



పాఠశాలకు సీలు వేస్తున్న ఎంఈఓ తులసీరెడ్డి

టెక్కలి: టెక్కలిలో రవీంద్రభారతి పాఠశాలకు శనివారం మండల విద్యా శాఖాధికారి దల్లి తులసీరెడ్డి తాళాలు వేశారు. విద్యాశాఖ నుంచి ఎటువంటి గుర్తింపు అనుమతులు లేకపోవడం పై పలుమార్లు హెచ్చరించినా సంబంధిత యాజమాన్యం స్పందించకపోవడంతో పాఠశాలను శాశ్వతంగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి 7వ తరగతికి సంబంధించి విద్యా శాఖ నుంచి ఏటా అనుమతులు తీసుకోకుండా తాత్సారం చేశారని, దీనిపై పలుమార్లు హెచ్చరించినా స్పందించకపోవడంతో జిల్లా అధికారుల ఆదేశాలతో పాఠశాలను మూసివేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల బదిలీ సర్టిఫికెట్లు(టీసీ)లను తమ కార్యాలయం ద్వారా అందజేస్తామని తెలిపారు. కాగా, పాఠశాల మూసివేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

చెరువులో ఆక్రమణలు అడ్డగింత



జేసీబీతో జంగిల్ తొలగిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక నరసన్న చెరువును శ్రీరామనగర్ సమీపంలో కొందరు వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడగా రెవెన్యూ సిబ్బంది స్పందించి అడ్డుకున్నారు. మాజీ సైనికులకు 1991లో చెరువు గర్భంలో పట్టా ఇచ్చారంటూ కొందరు శనివారం చెరువు భాగంలో ఉన్న జంగిల్‌ను జేసీబీతో శుభ్రం చేయించారు. స్థానికులు స్పందించి తహసీల్దార్ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆయన స్పందించి ఆర్ఐ సాయిరాంకు తగు సూచనలు చేశారు. ఈ మేరకు వీఆర్వో చెరువు వద్దకు వెళ్లి పనులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

పోలాకి : రాజపురం వద్ద మట్టి ట్రాక్టర్ ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. కోలకతాకు చెందిన నౌగాన ఆదిలక్ష్మి(54) బెలమర గ్రామంలో ఉన్న తన కుమార్తె ఇంటికి వచ్చింది. శనివారం సాయంత్రం గుల్లవానిపేట బీచ్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి తిరిగి వస్తుండగా.. అటుగా మట్టి తీసుకొస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆదిలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలాకి ఎస్ఐ రంజిత్ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ఆస్పత్రికి తరలించనున్నట్లు తెలిపారు.

పాత శ్రీకాకుళంలో..

పండగ శోభ



విద్యుత్ వెలుగులతో పాత శ్రీకాకుళం వీధులు

- సిరిమాను ఉత్సవాలకు ముస్తాబవుతున్న నగరం
- పదేళ్ల తర్వాత జరుగుతుండటంతో ప్రత్యేక ఏర్పాట్లు
- ఈ నెల 10న ఒకేసారి రెండు సిరిమాను ఉత్సవాలు
- పది లక్షల మంది జనాలు వస్తారని అంచనా

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళం సరికొత్తగా ముస్తాబవుతోంది. ఐదు దశాబ్దాల ఆనవాయితీని కొనసాగిస్తూ గ్రామదేవత పండగలకు సిద్ధమవుతోంది. ప్రతి పదేళ్లకోసారి జరిగే ఈ సిరిమాను ఉత్సవంలో సుమారు పది లక్షల మంది జనం తరలివచ్చే అవకాశం ఉన్నందున.. అందుకు తగ్గట్లుగా కమిటీ సభ్యులు, అధికారులు ఏర్పాట్లు చకాచకా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటు జిల్లా పరిషత్ నుంచి అటు బాదుర్లపేట, కునుకుపేట పరిసర ప్రాంతాల మధ్య వీధులన్నీ విద్యుద్దీప అలంకరణలతో ధగధగా మెరిసిపోతున్నాయి.

ఘన చరిత్ర..

దశాబ్దాల కిందట పాత శ్రీకాకుళంలో కలరా, మసూచి వంటి వ్యాధులు విజృంభించేవి. వాటి నుంచి అమ్మవార్లే కాపాడాలని కోరుతూ అప్పటి పేదలు సిరిమాను ఉత్సవం చేసేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో 1966లో తొలిసారిగా సిరిమాను నిర్వహించినట్లు కొందరు చెబుతుంటారు. అప్పటి నుంచి ప్రతి పదేళ్ల కొకసారి సిరిమాను వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది 2025లో మే 6న గ్రామదేవత పండగలు ప్రారంభమయ్యాయి. జూన్ 10న ముగింపు ఉత్సవం జరుగుతుంది. ఆ రోజున పెద్దమ్మతల్లి, నూకాలమ్మతల్లి సిరిమానుల అనుపు ఉత్సవంతో వేడుకలు ముగుస్తాయి. పాతశ్రీకాకుళంలో ఉన్న ఐదుగురు అమ్మవార్లు ముత్యాలమ్మతల్లి, నక్కవీధిలోని నూకాలమ్మతల్లి, సంతోషిమాత కూడలి వద్ద దుర్గమ్మతల్లి, మావూరు వీధిలోని పెద్దమ్మతల్లి, కొత్తపేట వద్ద సన్నాల పోలమ్మతల్లికి చల్లదనం కోసం 36 రోజులుగా పూజలు నిర్వహిస్తున్నారు.



ఇటీవల సమావేశమైన ఉత్సవ కమిటీ సభ్యులు

సిద్ధమవుతున్న సిరిమాను రథం



సిరిమాను తిరిగే ప్రాంతాలివే..

సిరిమాను ఉత్సవం ముందుగా మావూరి వీధిలో చిట్టియ్య ఇంటి నుంచి వెయ్యి కళ్ల ఘటంతో ప్రారంభమవుతుంది. రెండు సిరిమానులు సంతోషిమాత గుడి వద్దకు చేరుకున్న తరువాత అక్కడి నుంచి మావూరు వీధి, కలెక్టర్ బంగ్లా, హరిజన వీధి, బాదుర్లపేట, కొత్తపేట, కునుకుపేట వరకు వెళ్లి తిరిగి వెనుకకు వచ్చి కుందనపుపేట మీదుగా జిల్లా పరిషత్ కూడలికి చేరుతుంది. అక్కడి నుంచి దేశెల్లవీధి, నక్కవీధి, దండివీధి చేరుకొని పెద్దమ్మతల్లి ఆలయానికి ఒక సిరిమాను, నక్కవీధిలోని నూకాలమ్మతల్లి ఆలయానికి మరో సిరిమాను చేరుతుంది. సుమారు రెండున్నర కిలోమీటర్లు సిరిమాను ఊరేగింపు జరుగుతుంది. ఉత్సవం తిలకించేందుకు సుమారు 10 లక్షల మంది జనం వస్తారని అంచనా. చివరి రోజైన జూన్ 10న రెండు సిరిమానులు, దేశెల్లవీధి నుంచి పడవ, బాదుర్లపేట నుంచి రథం, దండి వీధి నుంచి ఏనుగు, కలెక్టర్ బంగ్లా వీధి నుంచి మహిషాసుర మర్దని, చిన్నచిన్న వేషాలు, గరిడి, మేళతాళాలతో అమ్మవార్ల ఊరేగింపు నిర్వహిస్తారు. 11వ తేదీన మధ్యాహ్నం 11గంటల నుంచి బంధువులకు, స్నేహితులకు విందు భోజనాలు మొదలవుతాయి.

పెద్దల నిర్ణయం..



సిరిమాను పండగను మాపెద్దలు నిర్ణయించారు. దాని ప్రకారం ప్రతి పదేళ్లకోసారి ఉత్సవం జరుపుతున్నాం. రద్దీ నేపథ్యంలో మహిళా భక్తులు మాత్రమే అమ్మవారిని తాకాలి. – దండి పంకజాక్ష దేవ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

అమ్మవారి సేవకుడిని



మొదటిసారి పెద్దమ్మ తల్లి సిరిమాను ఎక్కే అవకాశం కలిగింది. అమ్మవారి దయతో ఈ అవకాశం లభించింది. గత కొన్నేళ్లుగా అమ్మవారి సేవకుడిగా ఉన్నాను. – మావూరి కుమారస్వామి, పాత శ్రీకాకుళం

అమ్మవారి దయ..



సిరిమాను ఉత్సవం జరుగుతున్న నాటి నుంచి మా కుటుంబ సభ్యులే సిరిమాను ఎక్కుతున్నాం. ఈ ఏడాది నావంతు వచ్చింది. నూకాలమ్మ తల్లి సేవ చేసుకునే భాగ్యం కలిగింది. – పాలుమూరు అచ్యుతరావు, శ్రీకాకుళం

సంప్రదాయంగా..



పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తున్నాం. ఈసారి బాదుర్లపేట నుంచి అమ్మవారి వెనుక వెళ్లే రథం ఎక్కబోతున్నాను. ఎంతో ఆనందంగా ఉంది. – కొండక అప్పారావు, పాత శ్రీకాకుళం

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ
- మహిళ దుర్మరణం

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలోని సూర్య స్కూల్ కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందింది. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మసిగడాం జంక్షన్‌లో నివాసముంటున్న తోరాడ సాయి(36) జె.ఆర్.పురం జగనన్న కాలనీలోని శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బంధువు ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. సూర్య స్కూల్ జంక్షన్‌లో రోడ్డు క్రాస్ చేసేందుకు ఆగారు. ఆ సమయంలో విశాఖపట్నం వైపు నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురూ కిందపడిపోయారు. సాయి తలభాగం నుజ్జయిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందగా.. మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సాయి కమ్మ సిగడాం జంక్షన్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నారు. భర్త రామ్మూర్తి వంట పని చేస్తుంటారు. సాయి స్వగ్రామం దేవరాపల్లి. ఈమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. భర్త రామ్మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చిరంజీవి తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు (ఇన్‌సెట్లో) సాయి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ దుర్మరణం

ఎచ్చెర్ల: చిలకపాలెం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన లారీ క్లీనర్ సుబకాస్ మర్మర్ (35) మృతిచెందగా.. అస్సాంకు చెందిన డ్రైవర్ అసినాథ్ గాయాలపాలయ్యారు. గౌహతి నుంచి బెంగళూరు వెళ్తున్న కొరియర్ లారీ చిలకపాలెం వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. క్షతగాత్రులను 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ క్లీనర్ మృతి చెందాడు. ఎచ్చెర్ల ఎస్సై ఎస్.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బైక్ ఢీ.. వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని బర్మాకాలనీ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. టెక్కలి నుంచి రావివలస వైపు వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న చాకిపల్లి కొత్తూరు గ్రామానికి చెందిన పొన్నాడ రవి గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

లీజుకు ఆర్టీసీ ఖాళీ స్థలాలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో వివిధ బస్‌స్టేషన్లలో 6 ఖాళీ స్థలాలను 15 ఏళ్ల లీజుకు ఇచ్చే ప్రాతిపదికన టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, టెక్కలి, ఆమదాలవలస, ఎచ్చెర్లలో ఖాళీ స్థలాలకు సంబంధించి ఈ నెల 10న ఉదయం 11 గంటలకు శ్రీకాకుళం డ్రైవర్ల శిక్షణా కళాశాలలో ప్రీ బిడ్డర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెండర్ డాక్యుమెంట్లు, స్థలాల వివరాలను డ్రాయింగ్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 93460 45369 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



● శంభో శంకర!

జి.సిగడాం మండలం చెట్టుపొదిలాం గ్రామంలో ఎండల మల్లికార్జున స్వామి ఆలయం పునః ప్రతిష్టాపనోత్సవంలో భాగంగా శనివారం గ్రామస్తులు కలశ యాత్ర నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున కలశాలతో వెళ్లి విగ్రహాలకు చల్లదనం చేశారు. – జి.సిగడాం

● అష్టలక్ష్మీ వైభవం



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో జరుగుతున్న పెంటపోలమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మహిళలు దేవతామూర్తుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. – కాశీబుగ్గ

కొనసాగుతున్న కంచమ్మతల్లి ఉత్సవాలు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో కంచమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాలు ఆరో రోజైన శనివారం వైభవంగా జరిగాయి. అమ్మవారిని పీఠస్థానం నుంచి నేరుగా రైల్వే క్వార్టర్స్, మల్లా క్వార్టర్స్ మీదుగా ఎస్.ఆర్.సి.పురం కాలనీలో ఊరేగింపు చేపట్టారు. పార్వతీపురానికి చెందిన నమో వెంకటేశాయ, తాడేపల్లిగూడెం నవదుర్గలు, శ్రీకాకుళం దాండియా, గోపాల్‌పూర్ ధూమ్ ధమాకా, స్థానిక కళాకారుల గ్రూప్ డ్యాన్స్, పద్మనాభపురం పాలబొమ్మలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఢిల్లీ ఈవెంట్స్ ప్రోగ్రామ్‌కు జనం పోటెత్తారు. మరోవైపు అమ్మవారి నమూనా విగ్రహం ప్రాంగణం వద్ద వచ్చిన భక్తులకు పలువురు దాతలు ప్రసాదం పంపిణీ చేస్తున్నారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

విద్యుత్ షాక్‌తో ఆవులు మృత్యువాత



ఇజ్జాడపాలెంలో మృతిచెందిన పాడి ఆవు

సారవకోట: జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో రెండు పాడి ఆవులు మృత్యువాత పడ్డాయి. సారవకోట మండలం బుడితి గ్రామంలో నేతింటి నీలయ్య తన పాడి ఆవును పొలంలో మేతకు తీసుకెళ్లాడు. అక్కడ రైస్ మిల్లు కోసం ఏర్పాటు చేసిన రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగలడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా రూ.75 వేలు విలువైన ఆవు మృతి చెందినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బుడితిలో మృతి చెందిన పాడి ఆవు

ఎచ్చెర్ల: లావేరు మండలం ఇజ్జాడపాలెంలో తిరుపతి అనే వ్యక్తికి చెందిన ఆవు శనివారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడి ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. ఆవు విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.

ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయుల ఆందోళన

ఆమదాలవలస: ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదికతో ఇటీవల జరిగిన చర్చలలో ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి అంగీకరించినప్పటికీ ఇప్పుడు వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని నిర్ణయించడం దుర్మార్గమైన చర్య అని ఐక్యవేదిక సంఘాల ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆమదాలవలస మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వర్గాలకు ఆర్థికపరమైన అంశాలలో ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి మేలు చేయలేదని, కనీసం ఆర్థికేతర అంశాలైన బదిలీలు కూడా మాన్యువల్‌గా నిర్వహించలేని నిస్సహాయస్థితిలో ఉండడం శోచనీయమన్నారు. సరైన సౌకర్యాలు లేని కారణంగా మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించలేమని చెప్పడం ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకొని ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం డీఈఓ కార్యాలయ ముట్టడికి ఉపాధ్యాయులంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు టి.వి.టి.భాస్కరరావు, బొడ్డేపల్లి గోపీచంద్, తమ్మినేని సీతారాం, కింతలి చంద్రరావు, నూక అప్పలనాయుడు, మెండ శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలసలో ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మూల్యం చెల్లించకతప్పదా!

- నేటికీ జిల్లాకు రాని కరోనా పరీక్ష కిట్లు
- పొరుగు జిల్లాలో ఓ వ్యక్తికి కరోనాగా నిర్ధారణ!
- రాష్ట్ర వ్యాప్తంగా కేసులు పెరుగుతున్నా చలించని సర్కారు



శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం కరోనా పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేసులు పెరుగుతున్నా అందుకు తగ్గట్లు నివారణ చర్యలు చేపట్టకపోవడంతో తగిన మూల్యం చెల్లించాల్సివస్తోందేమోనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కోవిడ్ నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్న తరుణంలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు అప్పట్లో తానే ముఖ్యమంత్రిగా ఉంటే కరోనా రాష్ట్రంలోకి వచ్చేదా అని ఓ బహిరంగ సభలో అనడం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు ఆయనే ముఖ్యమంత్రిగా ఉండగా కరోనా నివారణకు కనీస చర్యలు చేపట్టకపోవడం విచారకరం. శ్రీకాకుళం జిల్లా వైద్యారోగ్యశాఖ కోవిడ్ పరీక్షా కిట్ల కోసం ప్రభుత్వానికి నివేదించి పది రోజులు కావస్తున్నా నేటికీ సరఫరా కాలేదు. కిట్‌ల కోసం ఎదురుచూసినా రిమ్స్ అధికారులు విశాఖపట్నం నుంచి పదుల సంఖ్యలో కిట్‌లను కొనుగోలు చేశారు. వ్యాధి లక్షణాలున్న అందరికీ కాకుండా తీవ్రమైన లక్షణాలు ఉన్నవారికి మాత్రమే పరీక్షలు జరుపుతున్నారు. కిట్ల కొరతే దీనికి కారణం.

విజయనగరంలో కలకలం..

పొరుగు జిల్లా విజయనగరంలో వ్యాధి లక్షణాలతో వచ్చిన ఓ రోగిని ఆసుపత్రిలో చేర్చి నిమోనియాగా చికిత్స చేస్తూ వచ్చారు. వారం రోజులైనా లక్షణాలు తగ్గకపోవడంతో రోగి నుంచి శాంపిల్‌ను సేకరించి పరీక్ష కోసం విశాఖపట్నం పంపించగా అతనికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అప్పటికే ఆ రోగి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ఐసీయూలో ఉంచి చికిత్స జరుపుతున్నారన్న వార్త జిల్లాలో దావానంలా వ్యాపించింది. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరోవైపు, ప్రజలు కూడా జాగ్రత్త చర్యలు చేపట్టాలని వైద్య వర్గాలు సూచిస్తున్నాయి. మాస్కులు ధరించడం, ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవడం, సామాజిక దూరం పాటించడం, జన సమూహాలున్న ప్రాంతాలకు తప్పనిసరైతే తప్ప వెళ్లకుండా ఉండటం వంటివి చేయాలని సూచిస్తున్నారు. వ్యాధి లక్షణాలుంటే తక్షణం వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఛాతిలో నొప్పితో ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు వంటివి ఉంటే వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని సూచిస్తున్నారు.

ఒకటి రెండు రోజుల్లో..



ప్రభుత్వానికి కిట్ల విషయం నివేదించాం. ఒకటి రెండు రోజుల్లో వచ్చే అవకాశముంది. ర్యాపిడ్ కిట్లు 2500 వరకు ఉన్నాయి. – డాక్టర్ కె. అనిత, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి, శ్రీకాకుళం